క్లుప్తంగా

నగరంలో రూ.77 కోట్ల ఆస్తిపన్ను వసూలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నుదారులు రూ.77 కోట్లు చెల్లించారని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. ఇంటి పన్ను, ఖాళీస్థలాల పన్ను, నీటిచార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీమాఫీ ప్రకటించడంతో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. మార్చి 31వ తేదీలోపు రూ.77.01 కోట్ల చెల్లింపులు జరిపారన్నారు. సంవత్సరం మొత్తం పన్నుల వసూలు రూ.58.76 కోట్లు కాగా, ఈఏడాది అదనంగా రూ.18.25 కోట్లు వసూలు చేయగలిగామన్నారు. ఈ నిధులతో నగరంలో కూడళ్ల, అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామన్నారు. ముందుస్తుగా పన్ను చెల్లించేవారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిఏటా ఏప్రిల్‌లో ఐదుశాతం రిబేటుతో పన్ను చెల్లించుటకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఎటువంటి బకాయిలు లేకుండా ఉన్న పన్నుచెల్లింపుదారులు 2023 – 24 సంవత్సరానికి ఏకమొత్తంగా పన్ను ఒకేసారి చెల్లిస్తే ఐదుశాతం రిబేటు ఇస్తామన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించేవరకూ పోరాటం

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించే వరకూ పోరాటం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుమేరకు స్థానిక శ్యామల సెంటర్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, ప్రజా సంఘాలు, అభ్యుదయ వాదులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు టి.అరుణ్, టి.మధు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ.. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం తప్ప ఒక్క కొత్త పరిశ్రమను కూడా స్థాపించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరానికి నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా ద్రోహం చేస్తోందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు జువ్వల రాంబాబు, నల్లా రామారావు, బి.పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఎద్దుల తరలింపు

రాజమహేంద్రవరం రూరల్: తుని వైపు నుంచి హైదరాబాద్‌కు 29 ఎద్దులను తరలిస్తున్న లారీని శనివారం బొమ్మూరు ఎస్సై జగన్ మోహన్, సిబ్బందితో కలసి దివాన్‌చెరువు జీరోపాయింట్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఎద్దులను గోకవరం సమీపంలోని గోశాలకు తరలించారు.

అలరించిన నృత్యోత్సవం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామనవమిని పురస్కరించుకుని స్థానిక సీతంపేట రామాలయం వద్ద శనివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత నృత్యోత్సవం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. శ్రీలక్ష్మీ శ్రీనివాస నృత్యాలయం నాట్యాచార్యులు కోసిరెడ్డి రమేష్ నాయుడు శిష్యబృందం ఈ ప్రదర్శన చేసింది.

ముగిసిన క్రీడా పోటీలు

రాజానగరం: ఓటమితో అంతా అయిపోయిందనుకుంటే పొరబాటు అని, దానిని గెలుపునకు తొలిమెట్టుగా భావించాలని గైట్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బరాజు అన్నారు. కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరిగిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు 34 కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో విన్నర్లు, రన్నర్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పీడీ డాక్టర్ సీఎం హెన్రీ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రథమం సాధిస్తే రూ.50 వేల బహుమతి

సీతానగరం: చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మండలంలో ప్రథమస్థానంలో నిలిస్తే రూ.50 వేలు బహుమతిగా అందిస్తామని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ప్రకటించారు. ఆయన శనివారం చినకొండేపూడి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్య అనేది సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు, గౌరవాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఉన్న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామలింగ భాస్కర్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నిర్వహించే గ్రామోత్సవం అనంతరం రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని చెప్పారు.

రేపటి నుంచే పింఛన్ల పంపిణీ

- ఏప్రిల్ 1, 2 తేదీల్లో బ్యాంకులకు సెలవు
- 3 నుంచి పంపిణీకి సిద్ధమైన వలంటీర్లు
- అర్బన్ పరిధిలో 29,363 మంది లబ్ధిదారులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

సీటీఆర్ఐ: సూర్యుడు రాకముందే ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి ముందుకు వచ్చి పేరు పేరున పిలిచి పింఛన్ అందజేసేవారు. అయితే ఆర్థిక సంవత్సరం ముగింపు, బ్యాంకుల సెలవు కారణంగా ఈ మహాయజ్ఞానానికి ఈ నెల చిన్న బ్రేక్ పడింది. మార్చి నెల బ్యాంకులకు ఫైనాన్స్ ఇయర్ క్లోజింగ్. మార్చి 31 వరకూ బ్యాంకులు పనిచేశాయి. ఏప్రిల్ ఒకటిన బ్యాంకులకు సెలవు వచ్చింది. అయితే రెండో రోజు ఆదివారం కూడా కావడంతో పనిచేయవు. దీంతో ఈనెల మూడో తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ విషయాన్ని పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్లు ఇప్పటికే తెలియజేశారు. దీంతో లబ్ధిదారులు గందరగోళం పడకుండా 3వ తేదీన తీసుకోవడానికి సిద్ధమయ్యారు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 29,363 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.8,21,53,250 ప్రభుత్వం అందజేస్తోంది.

లబ్ధిదారులకు ముందుగానే సమాచారం

జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పింఛన్ లబ్ధిదారులకు ప్రతినెలా ఒకటో తేదీనే సొమ్ములు అందజేస్తున్నారు. ఇప్పటి వరకూ పంపిణీలో ఎలాంటి జాప్యం జరగలేదు.

ఈసారి బ్యాంకుల సెలవు కారణంగా రెండు రోజులు ముందుకు జరిగింది. దీనిపై లబ్ధిదారులకు వలంటీర్లు సమాచారం ఇచ్చారు. అవ్వ, తాత, ఇతర పింఛన్ లబ్ధిదారులకు సీఎం జగన్ పెద్ద కుమారుడిలా మారారు. ఆయన అధికారంలోకి వచ్చాక దశల వారీగా పింఛన్ సొమ్మును పెంచారు. దీంతో ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా ఏర్పడింది. ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా గౌరవప్రదంగా జీవించే వీలు కలిగింది.

3వ తేదీన తీసుకుంటాం



మాకు ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ఈ ఒక్క నెల రెండు రోజుల తరువాత ఇస్తే నష్టం ఏమీ లేదు. గత నెలలో నేను ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటే అక్కడికి వచ్చి పింఛన్ అందించారు. ఈ నెల 3వ తేదీన ఇస్తామని వలంటీర్ ముందే చెప్పారు. అందుకే నేను ఒకటో తేదీన పింఛన్ రాలేదని బెంగ పడలేదు.

– జాన్, 31వ డివిజన్

ఇబ్బంది లేదు



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎప్పుడు పింఛన్‌కి ఇబ్బంది పడలేదు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి తీసుకు వచ్చేది. ఆదివారం కూడా పింఛన్ అందించారు. ఈ నెల మాత్రం 3వ తేదీన ఇస్తారని వలంటీర్ ముందుగానే చెప్పింది.

– వాసా వీర సత్యవతి, 90వ డివిజన్

ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ, అందరికీ అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన అవసరమని నూతనంగా విధుల్లో చేరిన వైద్యులకు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. నూతన వైద్యులకు శనివారం బొమ్మూరులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. టీబీ, కుష్ఠు నియంత్రణపై డాక్టర్ పి.లక్ష్మీదేవి, ఆర్‌సీహెచ్ గర్భిణి సేవలపై డాక్టర్ శ్రీవల్లి, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్‌అండ్ వెల్నెస్ సెంటర్లపై డాక్టర్ సుధీర్ అవగాహన కల్పించారు. డాక్టర్లు రవికుమార్, చైతన్య, బెండిట్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: పదో తరగతి పరీక్షలకు రాజమహేంద్రవరం డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఆనంద్ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. తరగతుల్లో ఫ్యాన్లు, లైట్లు, డెస్క్‌లు సరిపడేలా ఉండాలని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు ఉండరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అనంతరం నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల, కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మునిసిపల్ టౌన్ హైస్కూల్లో ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు. సందేహాలుంటే వెంటనే సిటింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లకు తెలియచేయాలన్నారు. అర్బన్ పరిధిలో 27 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

సిబ్బందిని తొలగిస్తే పోరాటం

ప్రకాశం నగర్: కొవ్వూరు టోల్‌గేట్ సిబ్బందిని పాత్ ఇండియా యాజమాన్యం అక్రమంగా తొలగిస్తే దశలవారీగా పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కార్మిక శాఖ సహాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా టోల్‌గేట్‌లో పనిచేస్తున్న కార్మికులకు జాబ్ కార్డు, ఐడీ కార్డు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అన్యాయంగా కార్మికులను తొలగిస్తే టోల్‌గేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

- ఎంపీ భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీలో అల్యూమినియం వర్కర్ల చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని షెల్టాన్ హోటల్ వెనుక వీరభద్ర నగర్‌లో ఆవరోడ్డు చుట్టుపక్కల నివసిస్తున్న 150 మంది అల్యూమినియం కార్మికులు, కుటుంబ సభ్యులతో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఎంపీ భరత్‌రామ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ఎన్‌వీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ తాడితోట నుంచి ఈస్టర్న్ రైల్వే స్టేషన్ రహదారిని మరింత విస్తరింపజేసి, డివైడర్ ఏర్పాటు చేసి, మొక్కలు పెంచనున్నట్టు తెలిపారు. మోరంపూడి జంక్షన్ జాతీయ రహదారి నుంచి షెల్టాన్ హోటల్ ఆర్టీసీ రోడ్డు వరకూ బ్రహ్మాండమైన రహదారిని నిర్మించామన్నారు. జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై చాలామంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన అల్యూమినియం వర్కర్లను వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్యాపురం కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మార్గాని సురేష్ అభినందించారు. కార్యక్రమంలో ఖాదీబోర్డు వైస్ చైర్‌పర్సన్ పిల్లి నిర్మల, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న, వైఎస్సార్‌టీయూసీ నాయకులు దాసరి ప్రసాద్, కార్మిక సంఘ నాయకులు పి.సత్యనారాయణ, టి.రామరాజు, బి.రమేష్, కె.వాసు, సీహెచ్ నాగేశ్వరరావు, కరుణాకర్, యూనియన్ గౌరవాధ్యక్షులు బి.సత్యనారాయణ, పి.వెంకన్న, జి.రాంబాబు పాల్గొన్నారు.

నాడు - నేడుతో ప్రభుత్వాస్పత్రుల్లో సదుపాయాలు

- కలెక్టర్ మాధవీలత
- కడియం ఆసుపత్రిలో వైద్య పరికరాల ప్రారంభం



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలను కల్పించి, ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి ఆంధ్ర పేపరుమిల్లు ద్వారా రూ.30 లక్షల విలువైన మెడికల్, సర్జికల్ పరికరాలు అందజేశారు. వాటిని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. దానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఆటో క్లావ్, ఆపరేషన్ థియేటర్ టేబుల్, వీపీ వర్క్‌స్టేషన్, పారా మానిటర్, డిజిటల్ ఎక్స్‌రే, కంప్యూటర్, కాపీయర్ మెషీన్, దయాథెరపీ, ఓపీ టేబుళ్లు, కుర్చీలు, సీలింగ్ లైట్లను సీఎస్ఆర్ ఫండ్ ద్వారా అందజేశారన్నారు. అలాగే నర్సరీ యాజమాన్యం ఆసుపత్రికి 17 సీలింగ్ ఫ్యాన్లు ఇచ్చిందన్నారు. అనంతరం ఏపీఎంఐడీసీ ద్వారా చేపట్టిన నాడు–నేడు పనుల పురోగతిని కలెక్టర్ మాధవీలత పరిశీలించారు. డ్రైనేజీ సక్రమంగా ఉండాలని, టాయ్‌లెట్లకు వెస్టన్ కమోడ్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న మహిళలతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్,బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీహెచ్ డాక్టర్ సనత్ కుమారి, వైద్యుడు శ్రీధర్, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), ఊటుకూరి శైలజ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా జగన్ ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- జేగురుపాడులో పవర్ టిల్లర్ల పంపిణీ



జేగురుపాడులో రైతులకు పవర్‌టిల్లర్లను అందజేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటోందని ఆ పార్టీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. జేగురుపాడు గ్రామంలోని సీహెచ్‌సీ గ్రూపునకు శనివారం రూ.4,35,000 విలువైన పవర్ టిల్లర్లను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రైతుల అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, గతానికంటే అధికంగా మద్దతు ధర లభించేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. వివిధ రకాల యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేసి ఆధునిక సాగు విధానాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, జేగురుపాడు ఎంపీటీసీ ఆకుల సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నే రాష్ట్ర భవిష్యత్తు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న నువ్వే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకువెళ్లి విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక చందన గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఈనెల 7వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల పరిధిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతో ఉన్న స్టిక్కర్లు, బ్యాడ్జీలు, కరపత్రాలను ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉన్నందున పార్టీశ్రేణులంతా చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఖాదీబోర్డ్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దండగుల మరిడయ్య, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మద్దాల అను, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్నా, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల విష్ణు చక్రవర్తి, రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- సీతంపేటలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో సమావేశం



ఆసరా నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పేదలు, మహిళల సంక్షేమానికి సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సీతంపేట సత్య రైస్‌స్టోర్ వీధిలో 37, 38, 40 డివిజన్లకు సంబంధించి వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర సమయంలో డ్వాక్రా మహిళలకు చేసిన వాగ్దానం ప్రకారం.. రాష్ట్రంలోని 80 లక్షల మంది మహిళలకు నాలుగు విడతల్లో రూ.25 వేల కోట్ల రుణమాఫీ చేస్తున్నారన్నారు. ఇప్పటికి మూడు విడతలు జమ చేశారన్నారు. జగనన్న ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని, అందుకు తగిన ఆర్థిక సహాయాన్ని మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో నగరంలో ఎంపీ, ఎమ్మెల్యేలుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తాను ఎంపీ అయిన నాటి నుంచి ఈ నాలుగేళ్లలో చేసిన నగర అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, పోలు విజయ లక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, మిషన్ మేనేజర్ రవిశంకర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ స్థలం పరిశీలన

గోదావరి గట్టున పూలే విగ్రహానికి ఎదురుగా గల స్థలంలో పూలే, అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఈ మేరకు శనివారం కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి 1200 గజాల స్థలాన్ని నగర పాలక సంస్థ కేటాయించింది. ఈ స్థలంలో నిర్మించే సామాజిక భవనంలో కింద కల్యాణ మండపం, పైభాగంలో స్టడీ సెంటర్ నిర్మిస్తారు. భవన శంకుస్థాపనకు సంబంధించి మార్కింగ్ తదితర విషయాలపై ఎంపీ భరత్, కమిషనర్ దినేష్ కుమార్, ఎస్ఈ పాండు రంగారావు, ఈఈ, డీఈ, ఏఈ తదితర అధికారులతో చర్చించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కడియపులంకలో స్వామివారి ఊరేగింపు

కడియం: కడియపులంకలోని హరిహర మహాక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి కళ్యాణం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా కల్యాణతంతు జరిపించారు. ఈ వేడుకల్లో భాగంగా ముందుగా స్వామివారికి పల్లకీపై గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల నడుమ తరలివచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. వాడపల్లి వెంకన్న కల్యాణం మాదిరిగానే ఇక్కడ కూడా స్వామివారి కల్యాణం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు.

కడియంలో..

మండల కేంద్రమైన కడియం కెనాల్ రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేతవేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. త్రయాహ్నిక పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారు జామునుంచే విశేష పూజలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పోస్టల్ అవుట్‌లెట్లకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువచేయడం, తపాలా స్టాంపులు, కవర్ల విక్రయం, రిజిస్టర్డ్, స్పీడ్‌పోస్టు ఉత్తరాలు, మనియార్డర్లు తదితర వాటికోసం రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలో ఫ్రాంచైజ్ అవుట్‌లెట్లు ప్రారంభించేందుకు తపాలాశాఖ నిర్ణయించిందని పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్ తెలిపారు. వీటిని నిర్వహించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 10వ తేదీ లోపు పోస్టల్ సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం డివిజన్, రాజమహేంద్రవరం – 533101 చిరునామాకు పంపించాలన్నారు. దరఖాస్తుల కోసం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం, మెయిన్ రోడ్, రాజమహేంద్రవరం చిరునామాలో సంప్రదించాలన్నారు. 18 ఏళ్లు పైబడి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై, సొంత ఖర్చులపై ఫ్రాంచైజీ నడుపుటకు ఆసక్తి కలిగిన వారినుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. తపాలాశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, ఎంపికైన అభ్యర్థులు తపాలాశాఖకు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలన్నారు. ఫ్రాంచైజి అవుట్‌లెట్ నడిపేందుకు రాజమహేంద్రవరం పరిధిలోని బొమ్మూరు, ఆనంద నగర్, ఎర్రకొండ, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆల్ బ్యాంకు కాలనీ, గెయిల్ ఆఫీసు ప్రాంతం, ఏకేసీ కాలేజీ, పద్మావతి నగర్, అలాగే రామచంద్రపురం పట్టణ పరిధిలో ఏరుపల్లి, ద్రాక్షారామ పరిధిలో వెలంపాలెం, మండపేట పట్టణ పరిధిలో గొల్లపేట కాలనీలను ఎంపిక చేశామన్నారు.

